

రాజన్నకు జనజాతర

వేములవాడ : రాజన్నను సోమవారం సుమారు 40వేల మంది దర్శించుకున్నారు.



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్న కోడెలను ధర్మపురం శ్రీభద్రకాళి గోశాలకు అందించారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /18.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్రీడలతో మానసికోల్లాసం



న్యాయవాదులతో జడ్జి వీరయ్య

జగిత్యాలజోన్: క్రీడలు మానసికోల్లాసం కలిగిస్తాయని జిల్లా మొదటి అదనపు జడ్జి వీరయ్య అన్నారు. స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ మైదానంలో సోమవారం న్యాయవాదుల క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎప్పుడు కేసులతో బిజీగా ఉండే న్యాయవాదులు మానసిక ప్రశాంతత కోసం క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకునేందుకు రోజూ వ్యాయామం కూడా చేయాలని సూచించారు. అనంతరం న్యాయవాదులు జిల్లా జడ్జి జట్టు, సబ్ జడ్జి జట్లుగా విడిపోయి క్రికెట్‌పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లా జడ్జి జట్టు విజయం సాధించింది. ఈకార్యక్రమంలో సబ్ జడ్జి ప్రసాద్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిహారిక, మొదటి, రెండో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్లు జితేందర్, వినీల్‌కుమార్, జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముద్దం ప్రభాకర్, ఓంప్రకాశ్, న్యాయవాదులు మురళీధర్‌రావు, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలకు సిద్ధం



మాట్లాడుతున్న చిన్నయ్య

కథలాపూర్(వేములవాడ): వచ్చేనెల 3వ తేదీ నుంచి ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీలు ఉంటాయని, కార్యదర్శులు రికార్డులు సిద్ధం చేసుకోవాలని జిల్లా విజిలెన్స్ అధికారి చిన్నయ్య సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో వెంటనే నాటించాలన్నారు. రికార్డుల్లో పేర్కొన్న పనులు క్షేత్రస్థాయిలో పక్కాగా ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీవో రాజేందర్, ఈసీ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



వెంకటేశ్వర్లుతో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

జగిత్యాలజోన్: జిల్లా కోర్టులో ఇద్దరు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ప్రధాన న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జంగిలి మల్లికార్జున్, జిల్లా మొదటి అదనపు కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కాసారపు మల్లేశం నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రాసిక్యూషన్ నియామక ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆయా కోర్టుల్లో వారు బాధ్యతలు స్వీకరించారు.అనంతరం ఆయా కోర్టుల న్యాయమూర్తులను వారు కలిశారు. అలాగే, ఉమ్మడి జిల్లా ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లను మర్యాదపూర్వకంగా కలిశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మల్లికార్జున్, మల్లేశంను జగిత్యాల బార్ అసోసియేషన్ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పదోన్నతి కల్పించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగిత్యాల: భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని పండిత జేఏసీ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ భాషా పండితులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామియాదవ్, రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతులు

జగిత్యాలటౌన్: ప్రజావాణి సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ రవి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. ప్రజల నుంచి పలు సమస్యలపై 42 అర్జీలు వచ్చాయి. అభాగ్యులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బీఎస్ లత, మకరంద్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

సిరిసిల్ల - సిద్దిపేటకు లైన్ క్లియర్!

- కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేమార్గంలో ముందడుగు
- రెండు పట్టణాల మధ్య ట్రాక్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్
- 30 కి.మీ.కి రూ.440 కోట్ల అంచనా వ్యయం
- బిడ్లు ఆహ్వానించిన దక్షిణ మధ్య రైల్వే
- హైదరాబాద్-సికింద్రాబాద్ డివిజన్ల వారధిగా కరీంనగర్



వేములవాడ-కరీంనగర్ రైల్వేస్టేషన్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ మార్గంలో మరో ముందడుగు పడింది. సికింద్రాబాద్ నుంచి కరీంనగర్ (కొత్తపల్లి) నగరాలను కలిపే అద్భుత ప్రాజెక్టు ఇది. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు తెలంగాణ వచ్చాక పట్టాలెక్కింది. ప్రస్తుతం గజ్వేల్ వరకు ట్రాక్ పనులు పూర్తయి.. ట్రయల్ రన్ కూడా నడుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిరిసిల్ల –సిద్దిపేట పట్టణాలను కలుపుతూ సుమారు 30 కిలోమీటర్ల దూరానికి బ్రాడ్‌గేజ్ రైల్వేట్రాకు నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే బిడ్లు ఆహ్వానించింది. ఈ పనులకు రూ.440 కోట్ల మేరకు అంచనా వ్యయాన్ని కూడా రూపొందించింది. మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి (కరీంనగర్) వరకు 151.36 మొత్తం కిలోమీటర్లు బ్రాడ్‌గేజ్‌లైన్. ఈ మార్గంలో సిద్దిపేట స్టేషన్(77 కి.మీ)–సిరిసిల్ల స్టేషన్ (106.88 కి.మీ) మధ్యన మొత్తం 29.8 కి.మీ ఈ బ్రాడ్ గేజ్ పనులకు రూ.440.288 ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో కాంట్రాక్టు అప్పగించేందుకు దక్షిణ మధ్య రైల్వే బిడ్డింగులను ఆహ్వానించింది.

ప్రాజెక్టు నేపథ్యం ఇదీ..!

వేములవాడ, సిరిసిల్ల, సిద్దిపేట ప్రజలకు రైలు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్న తలంపుతో 2006–07లో 151 కి.మీ.ల కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైనును రూ.1,167 కోట్ల అంచనా వ్యయంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. తరువాత ఈ మార్గం ఆర్థికంగా భారమని చెప్పి చేపట్టేందుకు రైల్వేశాఖ సుముఖత చూపలేదు. మొత్తం బడ్జెట్‌లో 1/3 వంతు ఖర్చుతోపాటు 100 శాతం భూమిని సేకరించి ఇవ్వడం, ఈ మార్గంలో ఐదేళ్లపాటు వచ్చే నష్టాలను భరించేందుకు రాష్ట్రం ముందుకువచ్చింది. దీంతో 2016లో ఈ ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కింది. ఈ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందోనని సిరిసిల్ల, వేములవాడ, కరీంనగర్ ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

మొదలైన ట్రయల్‌రన్..

ప్రస్తుతానికి మనోహరాబాద్– గజ్వేల్ మధ్య 32 కి.మీ. మేర ట్రాక్ పూర్తయి ట్రయల్‌రన్ కూడా నడుస్తోంది. త్వరలోనే మనోహరాబాద్–గజ్వేల్ నూతన రైల్వే మార్గంలో త్వరలోనే రైళ్లు నడిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తాజాగా గజ్వేల్ నుంచి కొడకండ్ల వరకు కొత్తగా నిర్మించిన 9.6 కిలోమీటర్ల రైల్వేలైన్‌ను ఇటీవల రైల్వే సేఫ్టీ కమిషనర్ అభయ్‌కుమార్ రాయ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు కూడా. ఈ రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే కోల్‌కతా, న్యూఢిల్లీ, ముంబై తదితర మహా నగరాలకు ఈ ప్రాంతంతో రైల్ కనెక్టివిటీ పెరుగుతుంది. పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాల వారికి ముంబై,బెంగళూరు, చెన్నై షిర్డీ, తిరుపతికి ఇక్కడి నుంచి రైళ్లు నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసి ఉంచింది.

రెండు డివిజన్లకు వారధిగా ఈ మార్గం..!

దక్షిణ మధ్య రైల్వే డివిజన్ పరిధిలో మొత్తం ఆరు డివిజన్లు ఉండగా అందులో మూడు దక్షిణ కోస్తా పరిధిలోకి వెళ్లాయి. ఇప్పుడు హైదరాబాద్, సికింద్రాబాద్, నాందెడ్ డివిజన్లు సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో ఉన్నాయి. కొత్తపల్లి–మనోహరాబాద్ సెక్షన్ హైదరాబాద్ డివిజన్ పరిధిలో ఉంది. అదే సమయంలో కాజీపేట– బల్లార్ష సెక్షన్ సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉంది. ఈ రెండు డివిజన్లను కలిపే వారధిలా కరీంనగర్ (కొత్తపల్లి) వద్ద మారనుంది. జగిత్యాల, నిజామాబాద్‌తోపాటు నాందేడ్ డివిజన్‌ను కలుపుతూ ఉత్తరాదికి వెళ్లేందుకు.. పెద్దపల్లి, కాజీపేట నుంచి వచ్చే రైళ్లకు కరీంనగర్ కేంద్ర బిందువుగా మారనుంది.

కొత్తపల్లి-మనోహరాబాద్ మార్గం విశేషాలు..!

విస్తరించి ఉన్న జిల్లాలు: సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్.
మార్గం తాకుతూ వెళ్లే గ్రామాలు: 70
రూట్లో మొత్తం రైల్వే స్టేషన్లు: 15
ఈ మార్గంలో పుణ్యక్షేత్రాలు, దర్శనీయ ప్రదేశాలు: వేములవాడ, కొమురవెల్లి, కొండపోచమ్మ, నాచారం లక్ష్మీనర్సింహా స్వామి ఆలయాలు.
మొత్తం పొడవు: 151.36 కి.మీ.
మెదక్ జిల్లాలో..: 9.30 కి.మీ.
సిద్దిపేట జిల్లాలో..: 83.40 కి.మీ.
రాజన్న సిరిసిల్ల జిల్లాలో..: 37.80 కి.మీ.
కరీంనగర్ జిల్లాలో..: 20.86 కి.మీ.
పూర్తిస్థాయిలో పూర్తయిన మార్గం: 42.6 కి.మీ.
రెండో దశలోని గజ్వేల్ టూ దుద్దెడ : 32 కి.మీ.

కుర్చీ కోసం పోటాపోటీ

- మున్సిపల్ చైర్‌పర్సన్‌పై కౌన్సిలర్ల అసంతృప్తి
- 27తో మూడేళ్లు పూర్తికానున్న బల్దియా పదవీకాలం
- అవిశ్వాసం ప్రవేశ పెట్టేందుకు ప్రజాప్రతినిధుల యత్నాలు
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నిర్ణయమే ఫైనల్!
- పాకాన పడుతున్న జగిత్యాల బల్దియా రాజకీయం



జగిత్యాల మున్సిపల్ కార్యాలయం

జగిత్యాల: బల్దియా చైర్‌పర్సన్‌పై సొంత పార్టీ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేయడం, ఆమె తీరుపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడం తదితర పరిణామాలు చకచకా సాగిపోతున్నాయి. ఇదేక్రమంలో ఒకవేళ అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టే అవకాశం ఉంటే.. చైర్‌పర్సన్ కుర్చీపై దస్తీ వేసేందుకు ఆ పార్టీలోని పలువురు ఆశావహులు రంగం సిద్ధం చేసుకుంటున్నారని ప్రచారం సాగుతోంది.

బీఆర్‌ఎస్‌లో తొలిసారి..

- జిల్లా ఆవిర్భావానికి ముందు జగిత్యాల బల్దియాలో దశాబ్దాలుగా కాంగ్రెస్ పాలన సాగింది.
- కాంగ్రెస్ హయాంలో ఎప్పుడూ కౌన్సిలర్ల అవిశ్వాస నిర్ణయాలు తెరపైకి రాలేదు.
- తొలిసారి బీఆర్‌ఎస్ పాలకవర్గం కొలువుదీరింది.
- చైర్‌పర్సన్ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించగా.. ముగ్గురు మహిళలు పోటీపడ్డారు.
- పద్మశాలీ వర్గానికి చెందిన భోగ శ్రావణి ఆ పదవి దక్కించుకున్నారు.
- ఈనెల 27వ తేదీతో బీఆర్‌ఎస్ బల్దియా పాలకవర్గ మూడేళ్ల పదవీకాలం పూర్తవుతుంది.
- ఈనేపథ్యంలో చైర్‌పర్సన్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, అభివృద్ధిని విస్మరిస్తున్నారనే అభియోగాలతో బీఆర్‌ఎస్‌కు చెందిన 27 మంది కౌన్సిలర్లు జగిత్యాల ఎమ్మెల్యేకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.
- గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక మహిళా చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి తెరలేవడం ఇదే తొలిసారి కావడంతో పురపాలికల ప్రాంతంలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.
- ఎమ్మెల్యేనూ పట్టించుకోవడం లేదని, తాము చెప్పినా వినట్లేదని, పార్టీని కాపాడుకునేందుకు అవిశ్వాస తీర్మానం ఒక్కటే పరిష్కార మార్గమని పలువురు కౌన్సిలర్లు చెబుతున్నారు.
- సుమారు మూడు నెలల నుంచే అవిశ్వాసానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది.
- మరోవైపు.. మూడేళ్ల గడువు సమీపిస్తున్న కొద్దీ కౌన్సిలర్లు ఏకతాటిపైకి వస్తున్నారు.
- చైర్‌పర్సన్ తీరుపై ఇప్పటికే అధిష్టానానికి చాలాసార్లు ఫిర్యాదు చేయడంతో అధిష్టానం కూడా ఆమెను చైర్‌పర్సన్ పదవి నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.
- మరోవైపు.. ఏ నిర్ణయమైనా ఎమ్మెల్యే చెప్పిందే ఫైనల్ అని చెబుతున్నారు.

కమిషనర్లపై ఒత్తిళ్లు..

మరోవైపు.. మున్సిపల్ అధికారులు, కమిషనర్లపై ఒత్తిళ్లు పెరుగుతుండడంతో వచ్చిన వారు వచ్చినట్లే బదిలీపై వెళ్తున్నారని, లేదా దీర్ఘకాలిక సెలవుపై వెళ్తున్నారని తెలుస్తోంది. ప్రజాసమస్యలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఇతర అభివృద్ధి పనులన్నీ పెండింగ్‌లో ఉంటున్నాయని, ఇందుకు చైర్‌పర్సన్ ఏకఛత్రాధిపత్యమే కారణమనే విమర్శలు పలువురి నుంచి వినవస్తున్నాయి.

మొదలైన పైరవీలు..

- మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ఇంకా అవిశ్వాస తీర్మానం అంశం ఫైనల్ కానేలేదు. కానీ, అప్పుడే చైర్‌పర్సన్ కుర్చీ కోసం కొందరు ఆశావహులు పైరవీలు ప్రారంభించారు.
- గతంలో కుర్చీ కోసం పోటీపడ్డ బండారు రజని, సమిండ్ల వాణి ఇప్పుడు క్యూలో ఉన్నారు.
- వీరితోపాటు పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన అడువాల జ్యోతి కూడా తన ప్రయత్నాలు ప్రారంభించారని అంటున్నారు.
- మరికొందరు ఆశావహులు అప్పుడే క్యాంప్ రాజకీయాలూ షురూ చేశారు.
- కొందరు రూ.లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఆఫర్ చేస్తూ తమకు మద్దతుగా నిలవాలని బేరసారాలకు దిగుతున్నారని తెలిసింది.
- మరోవైపు.. అవిశ్వాస తీర్మానం విషయాన్ని ఎమ్మెల్యే.. ఇటీవల మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.
- బీఆర్‌ఎస్ నుంచి 30 మంది కౌన్సిలర్లు ఉన్నారు.
- ఇండిపెండెంట్లు ఆరుగురు గెలుపొంది ముగ్గురు బీఆర్‌ఎస్‌లో చేరారు.
- కాంగ్రెస్ పార్టీ నుంచి ఏడుగురు గెలుపొందగా ఇందులో ఒకరు బీఆర్‌ఎస్‌లో చేరారు.
- బల్దియాలో బీఆర్‌ఎస్‌కు చెందిన 34 మంది కౌన్సిలర్లు ప్రస్తుతం ఉండగా, 28 మంది అవిశ్వాసానికి మొగ్గుచూపుతున్నారని తెలిసింది.

అవిశ్వాసానికి అవకాశం ఉందా?

బల్దియా పదవీకాలం మూడేళ్లు గడిస్తే అవిశ్వాస తీర్మానానికి అవకాశం ఉడేది. దీనిద్వారా తరచూ గొడవలు జరిగాయి. మంత్రి కేటీఆర్ చొరవ తీసుకుని మున్సిపల్ యాక్ట్– 2019 రూపొందించారు. దీనిప్రకారం.. పాలకవర్గ పదవీకాలం నాలుగేళ్లు పూర్తి అయితేనే అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టే వీలుంది. కానీ, ఈఫైల్ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. అందుకే.. మూడేళ్ల పదవీకాలం ముగిసినా అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

మామిడి మార్కెట్‌లో ఆధునిక సౌకర్యాలు

- మోడల్‌గా తీర్చి దిద్దేందుకు యత్నాలు
- త్వరలోనే ప్రారంభించేందుకు అధికారుల సన్నాహాలు
- హాజరుకానున్న వ్యవసాయ మంత్రి



చల్‌గల్ మామిడి మార్కెట్‌లో ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన షెడ్లు

జగిత్యాలఅగ్రికల్చర్: రాష్ట్రంలో జగిత్యాల మామిడి మార్కెట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే రూ.7కోట్లు – రూ.8 కోట్ల వ్యయంతో ఆధునిక హంగులతో కూడిన నాలుగు భారీ షెడ్లు నిర్మించారు. మామిడి సీజన్ ప్రారంభమయ్యేలోగా షెడ్లలో మిగిలిన అభివృద్ధి పనులు పూర్తిచేస్తారు. వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

షెడ్ల నిర్మాణం పూర్తి..

- మార్కెట్‌కు స్థల సమస్య తలెత్తడంతో అప్పటి మంత్రి జీవన్‌రెడ్డి పట్టుబట్టి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేత చల్‌గల్ వ్యవసాయ ప్రదర్శన క్షేత్రంలోని దాదాపు 20 ఎకరాల వాలంతరీ స్థలాన్ని ఇప్పించారు.
- ఇందులోనే చల్‌గల్ మామిడి మార్కెట్‌ను కొనసాగిస్తున్నారు.
- అయితే, గత 10ఏళ్ల –15 ఏళ్లుగా మామిడి మార్కెట్‌లో సరైన వసతులు లేక రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.
- ప్రతీ సీజన్‌లో మామిడి వ్యాపారులు తడకలతో షెడ్లు ఏర్పాటు చేసుకునేవారు.
- వీటికోసం ఒక్కో వ్యాపారికి కనీసం రూ.లక్ష ఖర్చు వచ్చేది.
- ఇలా, ఏటా సీజన్‌లో వేయడం, తర్వాత తీస్తూ ఉండేవారు.
- పదేళ్ల క్రితం ఓసారి అగ్ని ప్రమాదం జరిగి వ్యాపారులు వేసుకున్న షెడ్లతో పాటు కొనుగోలు చేసిన మామిడి కాయలు కాలిపోయి, భారీ నష్టం జరిగింది.
- దీంతో, వ్యాపారులు పర్మినెంట్ షెడ్లు నిర్మించాలని ప్రజాప్రతినిధులను కోరుతూ వచ్చారు.
- ఈ నేపథ్యంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ కవిత.. మామిడి మార్కెట్‌లో షెడ్ల నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించారు.
- నిధులు సరిపోక.. సంజయ్ ఎమ్మెల్యేగా గెలిచాక మరో రూ.2 కోట్లు మంజూరు చేయించారు.
- ఆ నిధులతో షెడ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు.
- ప్రస్తుతం షెడ్లలో సీసీ రోడ్ల నిర్మాణానికి మరో రూ.కోటి సైతం కేటాయించి, అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి కొనసాగిస్తున్నారు.

సీజన్ నాటికి స్థలం కేటాయింపు..

ఈ మామిడి సీజన్ నాటికి ఆధునిక హంగులతో నిర్మించిన భారీ షెడ్లలో వ్యాపారులకు స్థలం కేటాయిస్తారు. గతేడాది మార్కెట్ ఫీజు అధికంగా చెల్లించిన వారికి సీరియల్ ప్రకారం స్థలం కేటాయించాలని మార్కెట్ కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం నిర్మించిన షెడ్లలో సుమారు 80 మందికి స్థలం కేటాయించే అవకాశం ఉంది. ఈ స్థలం కూడా సరిపోకపోవడంతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సీఎం కేసీఆర్‌తో మాట్లాడి వాలంతరీ నుంచి మరో 10 ఎకరాలు మామిడి మార్కెట్‌కు కేటాయించారు. ఇప్పుడు ఈ స్థలంలోనే.. షెడ్లలో స్థలం లభించనివారితో పాటు కొత్తగా లైసెన్స్ తీసుకున్న వ్యాపారులు షెడ్లు వేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి ఏ వ్యాపారి కూడా రోడ్ల వెంట దుకాణాలు ఏర్పాటు చేయరాదని ఇప్పటికే ఆదేశాలు జారీచేస్తున్నారు. రోడ్ల వెంట వ్యాపారం చేసేవారు మార్కెట్ ఫీజు చెల్లించడం లేదని, అధికారుల పర్యవేక్షణ లేకకపోవడంతో ఏం జరుగుతుందో తెలియడంలేదని, ఈసారి వ్యాపారులు యార్డులోనే దుకాణాలు ఏర్పాటు చేయాలని మార్కెట్ కమిటీ నిబంధనలు తీసుకొస్తోంది.

త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు..

మామిడి మార్కెట్‌లో నిర్మించిన షెడ్లను వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత చేతుల మీదుగా ప్రారంభించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే షెడ్ల మధ్యలో సీసీ రోడ్ల పనులు త్వరితగతిని పూర్తిచేయాలని మార్కెట్ అధికారులను ఆదేశించారు. షెడ్లులోని ప్రతీవ్యాపారి షాపు వద్దకు వాహనం వెళ్లేలా రోడ్లు ఉండాలని మార్కెట్ ఉన్నతాధికారులను కోరారు. ఇప్పటికే పలుమార్లు షెడ్ల నిర్మాణాలు పరిశీలించిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్.. వ్యాపారులు, అధికారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులతో చర్చించారు. మామిడి మార్కెట్‌లో తాగునీరు, మూత్ర విసర్జన వంటి కనీస మౌలిక వసతులు కల్పించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మామిడి సీజన్ సమయంలోనే కాకుండా ఎప్పుడూ ఫ్రూట్ మార్కెట్‌గా ఉండేలా చల్‌గల్ మార్కెట్‌ను తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే పలుమార్లు ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు.

మామిడికి పెట్టింది పేరు



రాష్ట్రంలో మామిడికి కేరాఫ్ జగిత్యాల(చల్‌గల్) మార్కెట్ అనేలా మార్కెట్‌ను తీర్చిదిద్దుతున్నాం. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఇప్పటికే నాలుగైదుసార్లు సందర్శించారు. అధికారులు, వ్యాపారులకు సూచనలు చేశారు. రైతులతో పాటు వ్యాపారులు బాగుపడాలన్నదే మా ఆశయం.

– నక్కల రాధ, మార్కెట్ చైర్‌పర్సన్, జగిత్యాల

సృజనాత్మకత పెంపొందించుకోవాలి

- జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి నారాయణ



ప్రదర్శనలు తిలకిస్తున్న అధికారులు

మెట్‌పల్లి(కోరుట్ల): వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి దోహదం చేస్తాయని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి నారాయణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఇందులో నారాయణతోపాటు ఆర్డీవో వినోద్‌కుమార్, డీఎస్పీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు 170 అంశాలకు సంబంధించిన ప్రాజెక్టులు ప్రదర్శించారు. వీటిని అధికారులతోపాటు పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు తిలకించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అనుష్క, బండమీది రచన, రక్షితకు బహుమతులు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రూ.కోట్ల నష్టానికి బాధ్యులెవరు?



బీర్‌పూర్ మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించిన రైతులు, కాంగ్రెస్ శ్రేణులు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- బీర్‌పూర్‌లో రైతుల నిరసన

సారంగాపూర్(జగిత్యాల): భారీవర్షాలతో రోళ్ల వాగు కట్ట తెగి దిగువన ఉన్న అరగుండాల ప్రాజెక్టు, గోదావరి ఎత్తిపోతలు వరదలో కొట్టుకుపోయి రూ.కోట్ల ఆస్తి నష్టం వాటిల్లిందని, ఇందుకు బాధ్యులెవరనే దానిపై ప్రభుత్వం ఎందుకు విచారణ చేపట్టడంలేదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వం, రైతులు, మత్స్యకారులకు తీవ్ర నష్టం జరిగినా ఒక్క అధికారినైనా బాధ్యుడిని చేశారా అని ప్రశ్నించారు. ఈ యాసంగికి రోళ్లవాగు ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలనే డిమాండ్‌తో సోమవారం బీర్‌పూర్‌లో ధర్నా చేశారు. ప్రాజెక్టు తెగి వానాకాలం పంటలు పండలేదని, యాసంగికి ఈనెల 1, 15, 22వ తేదీల్లో సాగునీరు విడుదల చేస్తామని అధికారులు ప్రకటించారని గుర్తు చేశారు. అయితే, ఆ మాటలు నమ్మి రైతులు వరి నార్లు పోసుకుని నీటి కోసం నిరీక్షిస్తున్నారని తెలిపారు. నీటి విడుదలపై స్పష్టత లేక చాలామంది నార్లు పోసుకోలేదన్నారు. అరగుండాల ప్రాజెక్టు, ఎత్తిపోతల కింద సాగునీరు అందే పరిస్థితి లేదని, క్రాప్‌హాలిడే ప్రకటించి ఎకరాకు రూ.20 వేల చొప్పున రైతులకు పరిహారం చెల్లించాలని, మత్స్యకారులకు రూ.లక్ష పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు చెప్పిన గడువు తర్వాత సాగునీరు విడుదల చేయకపోతే ఈనెల 30న నీటిపారుదల శాఖ జిల్లా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, సింగిల్‌విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, ఎంపీటీలు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు.. రైతుల ఆందోళన నేపథ్యంలో ఘటనా స్థలానికి చేరుకున్న ఇంజినీరింగ్ అధికారులు.. ఈనెల 27నుంచి సాగునీరు విడుదల చేస్తామన్నారు. ఈమేరకు ఈఈ నారాయణరెడ్డి, డీఈ చక్రూనాయక్ రైతులకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ శ్రేణులు, రైతులు భారీ సంఖ్యలో తరలిరావడంతో పోలీసులు పెద్దసంఖ్యలో మోహరించారు.

క్లుప్తంగా

రాజన్న ఆలయానికి అంబులెన్స్ అందజేత



ఈవో కృష్ణప్రసాద్‌కు అంబులెన్స్ బహూకరిస్తున్న రాజమణిదేవీ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి రమణ

వేములవాడ: రాజన్న భక్తులకు ఆపదలో ఆదుకునేందుకు రాజమణిదేవీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం అంబులెన్స్‌ను అందజేశారు. ట్రస్టు ప్రతినిధి రమణ ఆలయ ఈవో కృష్ణప్రసాద్‌కు అందజేశారు. రమణ మాట్లాడుతూ ఇటీవల ఓ భక్తుడికి సరైన సమయంలో వైద్యం అందక మరణించాడని తెలుసుకుని బాధపడ్డామన్నారు. తమ ట్రస్టు ద్వారా భక్తులకు సేవలందించాలనే ఉద్దేశంతో అంబులెన్స్‌ను అందజేసినట్లు చెప్పారు.

రాజన్న సేవలో రిటైర్డ్ డీజీపీ దినేశ్‌రెడ్డి



దినేశ్‌రెడ్డి దంపతులకు ప్రసాదాలు అందజేస్తున్న ఏఈవో ప్రతాప నవీన్

వేములవాడ: రాజన్నను రిటైర్డ్ డీజీపీ దినేశ్‌రెడ్డి సోమవారం కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. స్వామి వారి దర్శనానంతరం ఏఈవో ప్రతాప నవీన్, ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు, అర్చకులతో వేదోక్త ఆశీర్వచనం గావించారు. డీఎస్పీ నాగేంద్రాచారి, సీఐ వెంకటేశ్, ఎస్సై వెంకట్రాజం ఉన్నారు.

మేకల దొంగలు అరెస్టు

ఇల్లంతకుంట(మానకొండూరు): మండలంలోని పలు గ్రామాల్లో మేకలు, వ్యవసాయ మోటార్ల చోరీకి పాల్పడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మండలంలోని ఎర్రనర్సుపల్లికి చెందిన పర్శ శంకరయ్య, రాగుల పర్శరామ్‌లకు చెందిన 15 మేకలను అదే గ్రామానికి చెందిన గుడిసె అజయ్, రాగుల దుర్గయ్య, రాగుల పర్శరాంకు చెందిన మూడు వ్యవసాయ మోటార్లు చోరీకి గురయ్యాయి. ఇల్లంతకుంటలో సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఎర్రనర్సుపల్లికి చెందిన తొత్తళ్ల అనిల్, రాగుల అనిల్, సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం విఠాలాపూర్, మాచాపూర్ గ్రామాలకు చెందిన సముద్రాల శ్రీనివాస్, కోడూరి స్వామిలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.39 వేల నగదు, మూడు విద్యుత్ మోటార్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకున్న ఎస్సై మహేందర్, సిబ్బందిని సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్ అభినందించారు.

అన్నదాతకు అందని 'మద్దతు'

- బహిరంగ మార్కెట్‌లో తగ్గుతున్న ధరలు
- క్వింటాలుపై రూ.5వేల నుంచి రూ.6వేలకు మించని వైనం
- రూ.15వేల వరకు చెల్లించాలని రైతుల డిమాండ్
- పంట సేకరణలో వ్యవసాయదారుల నిమగ్నం



శ్రీరాములపల్లెలో పసుపు పంట ఆకులు కోస్తున్న మహిళా కూలీలు

జగిత్యాలఅగ్రికల్చర్: వాణిజ్యపరమైన పసుపు సాగుకు జిల్లా పెట్టింది పేరు. జూన్, జూలైలో సాగు చేసిన పంట ప్రస్తుతం తవ్వకానికి వచ్చింది. కొందరు తవ్వి, ఉడుకబెట్టి మార్కెట్‌కు తరలించేందుకు యత్నిస్తున్నారు. అయితే, కొన్నేళ్లుగా బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.5వేల – రూ.6 వేల మధ్య ధర లభిస్తోంది. మిగతా పంటల మద్దతు ధర పెంచినట్లు పసుపు పంట క్వింటాలుకు రూ.15 వేల వరకు మద్దతు ధర చెల్లించాలని రైతులు దశాబ్దాలుగా ఉద్యమిస్తున్నా సత్ఫలితాలు రావడంలేదు. దీంతో మరోసారి అన్నదాతలు ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు.

మార్కెట్‌లో ధరపై అనిశ్చితి..

- జిల్లాలో దాదాపు 40 వేల ఎకరాల్లో పసుపు సాగైంది.
- దీనిద్వారా దాదాపు 8 లక్షల క్వింటాళ్ల – 9 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా.
- ఆహార పదార్థాల్లోనే కాకుండా చర్మసౌందర్య సాధనాలు, రంగుల పరిశ్రమలు, పరిమళ ద్రవ్యాల తయారీలో పసుపు వినియోగిస్తారు.
- దీంతో అంతర్జాతీయంగా ఈ పంటకు మంచి డిమాండ్ పలుకుతోంది.
- ఒకప్పుడు బంగారంతో పోటీపడ్డ పసుపు.. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో చతికిలపడిపోయింది.
- రైతులకు పెట్టుబడి కూడా రావడం లేదు.
- అంతేకాదు.. బహిరంగ మార్కెట్‌లో ఎప్పుడు ఎలాంటి ధర పలుకుతుందో తెలియని అనిశ్చితి నెలకొంది.
- దీనికితోడు ఈసారి నెలల తరబడి ఏకధాటి వర్షాలు కురవడంతో తెగుళ్లు ఆశించాయి. దిగుబడి ఎకరాకు 10 క్వింటాళ్ల –15 క్వింటాళ్లకే పరిమితమైంది.

పెరుగుతున్న పెట్టుబడి..

ఏడాది పాటు పండిస్తేనే పసుపు చేతికి వస్తుంది. దాదాపు 9 నెలల –10 నెలల వరకు నేలలోనే ఉంటుంది. అన్ని ఖర్చులు కలిపితే ఎకరాకు రూ.80 వేల – రూ.లక్ష వరకు పెట్టుబడి వస్తుంది. ఎకరాకి కనీసం లారీ లోడ్ కోడి ఎరువు వినియోగిస్తారు. దానిధర రూ.25 వేల వరకు చేరింది. పసుపు తవ్వే ఒక్కో కూలీ ఖర్చు రూ.700 వరకు పలుకుతోంది. ఎకరం పసుపు తవ్వేందుకు కనీసం రూ.25 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. ఉడుకబెట్టి, ఆరబెట్టి, మార్కెట్‌కు తరలించేందుకు మరో రూ.10 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. రసాయన ఎరువులు, విత్తనం, ట్రాక్టర్‌తో దున్నడం, కలుపు ఖర్చు.. ఇలా మరో రూ.20 వేల వరకు వెచ్చించాల్సిందే.. ఇంత చేసినా ఎకరాలోని పంటకు కనీసం రూ.లక్ష కూడా రావడం లేదు.

నిల్వ చేసే పరిస్థితులు లేక..

- జిల్లా పసుపు తవ్వి, వెంటనే ఉడకబెట్టి, నిజామాబాద్, మెట్‌పల్లి, జగిత్యాల మార్కెట్‌కు తరలించి విక్రయిస్తారు.
- ఇళ్లలో నిల్వ చేసే పరిస్థితి లేకపోవడం, నిల్వ చేస్తే పురుగులు ఆశించి పంటను నష్టం చేస్తుండటంతో ఏదోఓ ధరకు రైతులు విక్రయిస్తున్నారు.
- పసుపు ఒక్కసారిగా మార్కెట్‌కు వస్తున్న సమయంలో వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారు.
- పసుపు నిల్వ చేయాలంటే కోల్డ్ స్టోరేజీలు అవసరం. కానీ, జిల్లాలో ఒకట్రెండు ప్రైవేట్ కోల్డ్ స్టోరేజీలు ఉన్నా.. అందులో వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసిన పసుపు నిల్వచేస్తున్నార.
- ధర వచ్చినప్పుడు పెద్దమార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు.

రాజకీయ అస్త్రంగా..

పసుపు బోర్డు రాజకీయ అస్త్రంగా మారినా.. రైతుల తలరాతలను మార్చడం లేదు. గత పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి దాదాపు 500 మంది వరకు పసుపు రైతులు పోటీ చేశారు. దీంతో సమస్య ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. రైతుల ఆందోళనతో పసుపు బోర్డుకు బదులు నిజామాబాద్‌లో సుగంధ ద్రవ్యాల రీజినల్ కార్యాలయం ఏర్పాటు చేశారు. దీనిద్వారా రైతులకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. బోర్డు పక్కన పెట్టినా.. పసుపు క్వింటాల్‌కు రూ.15 వేల వరకు మద్దతు ధర చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వాలు స్పందించాలి



పసుపు విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులను ఆదుకోవాలి. కేంద్రప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించాలి, ఆ ప్రకటించిన ధరకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలి. దీనిద్వారా రైతులకు కొంతలో కొంత ఉపశమనం కలుగుతుంది.

– ఏలేటి జలేందర్‌రెడ్డి, ఇటిక్యాల, రాయికల్

ధర లేకపోతే ఎలా?



ఈసారి వర్షాలతో ఆశించిన స్థాయిలో పసుపు దిగుబడి రాలేదు. ఎకరాకి 20 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్లకు పడిపోయింది. ధర గతంలో రూ.15 వేలు పలికితే.. ఇప్పుడు రూ.5 వేల – రూ.6 వేలకు పడిపోయింది. పెట్టుబడి కూడా రాకపోతే ఎలా?

– ఎ.స్వామిరెడ్డి, శ్రీరాములపల్లి, గొల్లపల్లి

కంటి పరీక్షలు చేయించుకోవాలి



కంటి వెలుగు పరీక్ష కేంద్రంలో సేవల తీరు పరిశీలిస్తున్న కలెక్టర్ రవి

జగిత్యాల: ఉద్యోగులు కూడా కంటి పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ రవి సూచించారు. ఉద్యోగుల కోసం కలెక్టరేట్‌లో కంటి వెలుగు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, కంటి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా సిబ్బందికి అనువుగా ఉంటుందన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. జిల్లా న్యాయస్థానం, పోలీసు శాఖలో కూడా శిబిరాలు ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో శ్రీధర్, ప్రోగ్రాం అధికారి స్వామి ఉన్నారు.

ఖిలా పనుల్లో వేగం పెంచండి

జగిత్యాల: రిపబ్లిక్ డే వేడుకలను పురస్కరించుకుని ఖిలా పనులను వేగవంతం పూర్తిచేయాలని కలెక్టర్ రవి సూచించారు. కలెక్టరేట్ నుంచి ఆయన అధికారులతో సోమవారం కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రిపబ్లిక్ డేను పురస్కరించుకుని అన్ని పనులను పూర్తి చేయాలన్నారు. మన ఊరు మన బడి, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, కంటివెలుగు సెంటర్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అన్నారు. ఇందులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మకరంద్, లత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



అంబులెన్స్‌లో క్షతగాత్రుల తరలింపు

ముస్తాబాద్(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతిచెందగా, ఇద్దరు గాయపడ్డారు. పోతుగల్‌కు చెందిన బండారి బాలయ్య(45) ద్విచక్ర వాహనంపై ఒడిశా కార్మికురాలు శీలవతి(53)తో నామాపూర్ వైపు వెళ్తుండగా.. నామాపూర్‌కు చెందిన సడిమెల రాజలింగం బైక్‌పై అటు వైపే వెళ్తున్నాడు. ఈక్రమంలో రెండు వాహనాలు అదుపుతప్పి ఢీకొట్టుకున్నాయి. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాజలింగంను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. గాయపడ్డ మిగతా ఇద్దరు సిరిసిల్ల ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు.

మా భూముల్లో ఇథనాల్ పరిశ్రమ వద్దు

- ఇండస్ట్రియల్ పార్క్ పేరిట భూములు లాక్కోవద్దు
- మెట్లచిట్టాపూర్ వాసుల ఆవేదన.. కలెక్టర్‌కు మొర



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

జగిత్యాలటౌన్: మెట్లచిట్టాపూర్ గ్రామ పరిధిలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేయొద్దని, ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేసుకోవాలని ఆ గ్రామస్తులు కోరారు. ఇండస్ట్రియల్ పార్క్ పేరిట తమ భూములు లాక్కోవద్దన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక జేఏసీ గా ఆవిర్భవించిన గ్రామస్తులు.. సోమవారం జిల్లా కేంద్రానికి ర్యాలీగా తరలివచ్చి కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఇథనాల్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో విలువైన భూములు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన చెందారు. ఇథనాల్ ఫ్యాక్టరీ పేరుతో మెట్లచిట్టాపూర్ శివారులో గతంలో ప్రభుత్వం తమకు ఇచ్చిన భూములు లాక్కుంటున్నారని ఆరోపించారు. పట్టాలు ఇవ్వగా మిగిలిన భూమిలోనూ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు వద్దన్నారు. దీనిఏర్పాటు ద్వారా వ్యవసాయ భూములు కలుషితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మిగులు భూముల్లో ప్రతిపాదించిన గురుకుల పాఠశాల, మోడల్‌స్కూల్, కేజీబీవీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆ తర్వాత మిగులు భూములను గ్రామంలో భూమి లేని పేదలకు పంచాలని కోరారు. బాధితులకు తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జనసమితి కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కంతి మోహన్‌రెడ్డి, జేఏసీ సభ్యులు దేవరాజు, దేవేందర్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో బెంచీలకు నిప్పు

మెట్‌పల్లి(కోరుట్ల): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బెంచీలకు ఆకతాయిలు నిప్పు పెట్టారు. కళాశాల ఆవరణలో నిర్మిస్తున్న నూతన భవనంలోని ఓ గదిలో బెంచీలు నిల్వ చేశారు. వాటికి సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఈ సంఘటనలో ఐదు బెంచీలు కాలిపోయాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

ఏసీడీ పేరిట దోచేస్తున్నారు



వెల్గటూర్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- వెల్గటూర్‌లో కాంగ్రెస్ శ్రేణుల రాస్తారోకో

వెల్గటూర్(ధర్మపురి: ఏసీడీ పేరిట విద్యుత్ వినియోగదారుల నుంచి అధిక బిల్లులు వసూలు చేస్తూ ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతోందని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధ్వజమెత్తారు. ఏసీడీ వసూళ్లను నిరసిస్తూ మండల కేంద్రంలోని ఏడో నంబరు రాష్ట్ర రహదారిపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం వెల్గటూర్ ఏఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో లక్ష్మణ్‌కుమార్ మాట్లాడారు. పేదలను దోచుకునేందుకు ప్రభుత్వం ఏసీడీ అంటూ కుట్ర చేస్తోందన్నారు. సామాన్యులకు అర్థంకాని రీతిలో ఆర్నెల్ల క్రితమే డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేశారని ఆరోపించారు. ఆ విషయాన్ని మరిచిపోకముందే ఇప్పుడు ఏసీడీ చార్జీల పేరిట వినియోగదారులపై ఆర్థికభారం మోపుతున్నారని మండిపడ్డారు. గత ఎనిమిదేళ్లుగా కరెంట్, బస్, భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు విపరీతంగా పెంచుతున్నారని, నిత్యావసరాల ధరలు ఆకాశన్నంటాయని పేర్కొన్నారు. తద్వారా పేదలపై ఆర్థికభారం పడి ప్రజల నడ్డి విరుగుతోందని అన్నారు. ఏసీడీ చార్జీలు రద్దు చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వెల్గటూర్, ధర్మపురి, పెగడపల్లి, ధర్మారం, గొల్లపల్లి మండలాల అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, సంగనబట్ల దినేశ్, రాములుగౌడ్, వేణు, సుభాష్, సర్పంచ్ మురళి పాల్గొన్నారు.

రూ.11లక్షల విరాళం ఏదీ?



పూజలు చేస్తున్న పవన్‌కల్యాణ్(ఫైల్)

కొండగట్టు(చొప్పదండి): జన సేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ 2018 జనవరి 22న కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆ సమయంలో ఆలయ అభివృద్ధికి రూ.11లక్షలు విరాళం ప్రకటించారు. కానీ, ఇప్పటికీ పైసా రాలేదు. స్వామివారి దర్శనం కోసం అప్పుడు వచ్చిన పవన్ కల్యాణ్.. కొండగట్టు సమీపంలో ప్రమాదం బారినపడ్డారు. ఆ వెంటనే స్వామివారిని మనసులో తలచుకుని మొక్కుకున్నారు. ఆలయ అభివృద్ధికి రూ.11లక్షలు విరాళం ఇస్తానని అర్చకులతో అన్నారు. దాదాపు ఐదేళ్లు గడిచినా పైసా రాలేదు. ఈనెల 24న జనసేనాని మరోసారి కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దర్శనం కోసం రానున్నారు. సన్నిధిలో తన వాహనం వారాహికి పూజలు చేయనున్నారు. ఈసారైనా విరాళం అందిస్తారా? అని భక్తులు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఈ విషయంపై ఆలయ ఈవో వెంకటేశ్‌ను సంప్రదించగా, సినీ నటుడు ప్రకటించిన రూ.11 విరాళం ఇంకా ఆలయానికి చేరుకోలేదన్నారు.

విద్యార్థిని దత్తత తీసుకున్న స్వచ్ఛంద సంస్థ



రోహిత్

ధర్మపురి: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ, ఉన్నత చదువులు చదవలేని స్థితిలో ఉన్న ఓ సరస్వతీ పుత్రుడిని దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చింది ఓ స్వచ్ఛంద సంస్థ. నిజామాబాద్‌కు చెందిన ఉత్తనూర్ రమేశ్ – మంజుల దంపతులు. వీరిది నిరుపేద కుటుంబం. ఈ దంపతులకు కుమారుడు రోహిత్ ఉన్నాడు. చదువులో ప్రతిభ కనపరుస్తున్నాడు. తండ్రి గతంలోనే మృతి చెందగా తల్లి అనారోగ్యంతో బాధపడుతోంది. అయితే, రోహిత్ హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో బీటెక్‌లో సీటు లభించింది. బీటెక్ పూర్తిచేయాలనే పట్టుదలతో ఉన్న రోహిత్‌కు ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయి. తల్లి కూడా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఏం చేయాలో అర్థం కావడంలేదు. ఈ విషయం తెలుసుకున్న స్టూడెంట్ అడాప్షన్ ప్రోగ్రాం(ఎస్‌ఏపీ) స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ గొల్లపెల్లి గణేశ్ ఆధ్వర్యంలో దాతల సాయంతో రోహిత్‌ను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చారు. బీటెక్ మొదటి సంవత్సరం కోసం అయ్యే ఖర్చు సుమారు రూ.70వేలను అమెరికాలో ఉంటున్న ధర్మపురికి చెందిన ఎన్‌ఆర్‌ఐ పణతుల శ్రీధర్ సోమవారం చెల్లించారు. ఈసందర్భంగా దాత శ్రీధర్‌కు సంస్థ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఆపద సమయంలో మేమున్నామంటూ నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న ఎస్‌ఏపీ సంస్థ సేవలనూ అభినందించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రుద్రంగి(వేములవాడ): రుద్రంగిలో ఆదివారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. స్థానికులు, రుద్రంగి ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు. రుద్రంగిలోని ఇందిరాచౌక్‌లో నివసించే పుట్కపు లక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం బంధువుల ఇంటికెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. సోమవారం ఉదయం అటుగా వచ్చి గమనించిన చుట్టుపక్కల వారు లక్ష్మికి సమాచారం ఇచ్చారు. బీరువా పగులగొట్టి ఉంది. బీరువాలో దాచిన మూడు తులాల బంగారం, రూ.4వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. రుద్రంగి ఎస్సై ప్రభాకర్ క్లూస్ టీంతో వెళ్లి ఆనవాలు సేకరించారు. లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన రేవెల్లి మొండయ్య(38) అనారోగ్యం పాలై మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం పురుగుల మందు దాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య మధునమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాల్వశ్రీరాంపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

- డిచ్‌పల్లిలో ఘటన .. ముత్యంపేటలో విషాదం



ఇంద్రాల రమేశ్(ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఇంద్రాల రమేశ్(31) ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్సై ప్రణయ్, స్థానికుల కథనం ప్రకారం.. జిల్లాలోని ముత్యంపేటకు చెందిన ఇంద్రాల రాజలింగం –కళావతి దంపతులకు ఒక కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. చిన్నకుమారుడైన రమేశ్‌కు ఏడాదిన్నర క్రితం మేడిపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన యువతితో వివాహం జరిగింది. ఇద్దరూ నిజామాబాద్‌లోని ఖలీల్‌వాడిలో నివాసం ఉంటున్నారు. రమేశ్ రెండేళ్లుగా మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. పనిపై బెంగళూరు వెళ్తున్నానని ఇంట్లో చెప్పాడు. నాలుగు నెలల గర్భిణి అయిన తన భార్యను రెండ్రోజుల క్రితం పుట్టింటికి పంపించాడు. ఈక్రమంలో సోమవారం ఇంద్రాల రమేశ్ తన ద్విచక్రవాహనంపై డిచ్‌పల్లి రైల్వేగేట్ వద్దకు వెళ్లాడు. బైక్‌ను బదిలి పెట్టి ఎదురుగా వస్తున్న కాచిగూడ– అకోలా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. యువకుడి శరీర భాగాలు గేటుకు ఇరువైపులా చెల్లాచెదురుగా పడడంతో స్థానికులు, వాహనదారులు భయకంపితులయ్యారు. లోకో పైలట్ వాకీటాకీ ద్వారా డిచ్‌పల్లి స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చారు. స్టేషన్ మాస్టర్ సమాచారంతో రైల్వే ఎస్సై ప్రణయ్, హెడ్ కానిస్టేబుల్ రవికిరణ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహం వద్ద లభించిన పర్సులో ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడిని జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన ఇంద్రాల రమేశ్‌గా గుర్తించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. రమేశ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడి మొబైల్‌ఫోన్‌ను ఎవరో ఎత్తుకెళ్లినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అది లభిస్తే ఆత్మహత్యకు గల కారణాలు తెలిసే అవకాశాలు ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి సోదరుడు రైల్వే పోలీసులను సంప్రదించారు. మంగళవారం మృతుడి తండ్రి, భార్యను పిలిపించి వారి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తామని, దానిప్రకారం కేసు నమోదు చేస్తామని రైల్వేపోలీసులు తెలిపారు.

మధుమేహంతో డిగ్రీ విద్యార్థిని మృతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): డిగ్రీ పూర్తి చేసి ఉన్నతంగా స్థిరపడదామనుకున్న యువతి ఆశలు ఆవిరయ్యాయి. పెళ్లి చేసి అత్తారింటికి పంపుదామని కలలు కన్న తల్లిదండ్రుల గుండెలు అవిసిపోయాయి. కలిసి చదువుకున్న స్నేహితుల హృదయాలు తల్లడిల్లాయి. డిగ్రీ విద్యార్థిని మధుమేహంతో ప్రాణాలు కోల్పోవడం ఎల్లారెడ్డిపేటలో విషాదం నింపింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేటకు చెందిన నేవూరి ప్రభాకర్‌రెడ్డి–లత దంపతుల కూతురు చందనా రెడ్డి డిగ్రీ చదువుతోంది. చందనారెడ్డి షుగర్ వ్యాధితో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆర్నెల్ల క్రితం కంటిచూపు స్వల్పంగా కోల్పోయింది. ఫిట్స్ కూడా రావడంతో చికిత్స పొందుతోంది. ఈక్రమంలో ఆరోగ్యం క్షీణించడంతో ఆర్నెల్లుగా హైదరా బాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆరోగ్యంగా తిరిగి వస్తుందనుకున్న తల్లిదండ్రుల కలలు నెరవేరలేదు. ఆస్పత్రిలోనే చికిత్స పొందుతూ సోమవారం ప్రాణాలు కోల్పోయింది. కూతురును కాపాడుకునేందుకు ఆ తండ్రి రూ.9.50 లక్షల వరకు వెచ్చించినా ప్రాణం నిలువలేదు. కుటుంబ సభ్యులు, స్థానికుల రోదన మధ్య అంత్యక్రియలు పూర్తిచేశారు.

చార్జీలు రద్దు చేయకుంటే ఉద్యమిస్తాం



అధికారికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

- బీజేపీ శ్రేణుల హెచ్చరిక
- విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన

జగిత్యాలజోన్:విద్యుత్ సంస్థ గృహవినియోగదారులపై విధించిన ఏసీడీ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. బీజేపీ నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్–నిజామాబాద్ హైవేపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, సామాన్యులను ఇబ్బందులకు గురిచేసే ఏసీడీ చార్జీలను వెంటనే రద్దు చేయాలన్నారు. ఇప్పటికే బస్, రిజిస్ట్రేషన్ చార్జీలు అడ్డగోలుగా పెంచి ప్రజల నడ్డివిచారని ఆరోపించారు. ఏసీడీ చార్జీలు రద్దు చేసేంత వరకు ప్రజలెవరూ విద్యుత్ బిల్లులు చెల్లించవద్దని, గ్రామసభల్లో తీర్మానాలు చేయాలని ఆయన కోరారు. బీజేపీ నాయకులు వీరబత్తినిఅనిల్, నలువాల తిరుపతి, కల్లెడ ధర్మపురి, ఎండబెట్ల వరుణ్, జనార్దన్, శ్రావణ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, భరత్, రాజు, సోమేశ్వర్‌రెడ్డి, పవన్‌సింగ్, వెంకటేశ్, ప్రవీణ్, సంజీవ్, వేణు, శ్రీధర్, జీవన్, రమేశ్, జలేందర్ పాల్గొన్నారు.